క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



ప్రిన్సిపల్‌కు పుష్పగుచ్ఛం అదిస్తున్న అధ్యాపకులు

రాయచోటి జగదాంబ సెంటర్: రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాల తాత్కాలిక ప్రిన్సిపల్‌గా డాక్టర్ హైదర్ అలీ(ఎఫ్‌ఏసీ) శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన రాయచోటి మహిళా డిగ్రీ కళాశాల రెగ్యులర్ ప్రిన్సిపల్‌గా పనిచేస్తుండగా, ప్రభుత్వ కళాశాల బాధ్యతలు అప్పగించారు ఆయన మాట్లాడుతూ కళాశాల పరిపాలనను మరింత బలోపేతం చేయడం, విద్యార్థులకు మెరుగైన విద్యఅందించడమే తన లక్ష్యం అన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు



ట్రాక్టర్ డ్రైవర్లకు సూచనలిస్తున్న ఎస్‌ఐ రామకృష్ణ

గాలివీడు: రహదారి భద్రతా నియమాలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ రామకృష్ణ అన్నారు. స్థానిక పశువుల సంత మైదానంలో ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాహనాలకు రహదారి భద్రతా చట్టాలపై అందరికీ అవగాహన ఉండాలన్నారు. వాహనం నడిపేటప్పుడు సెల్‌ఫోన్ వాడరాదని, వాహనాల్లో పెద్ద శబ్దంతో పాటలు పెడితే ట్రాక్టర్ డ్రైవర్లను ఉపేక్షించేది లేదన్నారు. డ్రైవర్లు లైసెన్సులు, వాహన రికార్డులు కలిగి ఉండాలన్నారు. ట్రాలీ వెనుక భాగంలో రేడియం స్టిక్కర్లు అతికించుకోవాలన్నారు.

ఘనంగా అభయాంజనేయ స్వామి తిరునాల





అలంకరణలో ఆలయం అభయాంజనేయస్వామి

రాయచోటి టౌన్: పట్టణంలోని సుండుపల్లె క్రాస్ రోడ్డులో వెలసిన అభయాంజనేయ స్వామి తిరునాల శనివారం వైభవంగా జరిగింది. శనివారం ఉదయం ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి అలంకరించారు. ఉదయం రాత్రి వరకు అన్న ప్రసాద వితరణ జరిగింది. విద్యుద్దీపాలతో అలంకరించిన చాందినీ బండ్లతో వచ్చిన భక్తులు ఆలయం ప్రాంగణంలో ఊరేగింపు నిర్వహించారు.

ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న గడికోట మోహన్‌రెడ్డి

రాయచోటి టౌన్: పట్టణంలోని చెక్‌పోస్టు వద్ద గల శిరిడిసాయి ఆలయ వార్షికోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త డాక్టర్ బయారెడ్డి, సంగమ్మ ఆధ్వర్యంలో శనివారం ఉదయం సాయినాథుడికి విశేష పూజలు, అభిషేకం జరిపారు. మందిరం ఆవరణలో వేదపండితులు హోమం నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. అనంతరం స్వామిని పల్లకిలో ఊరేగించారు. లక్కిరెడ్డిపల్లి మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి హోమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ ఇంజినీరు నాగేశ్వరరావు, సూరం వెంకట సుబ్బారెడ్డి, పాల్గొన్నారు.


తహసీల్దారుకు సన్మానం



తహసీల్దారును సన్మానిస్తున్న జనం

రాయచోటి టౌన్: మండలంలోని మాసాపేట గ్రామంలో శ్మశాన సమస్యను పరిష్కరించడంతో తహసీల్దారు నరసింహ కుమార్‌ను గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. గ్రామస్థులు మాట్లాడుతూ తమ గ్రామం నుంచి కస్పా గొల్లపల్లె, రెడ్డివారిపల్లెకు మధ్య శ్మశానానికి వెళ్లే దారి సరిగా లేక ఇబ్బంది పడ్డామన్నారు. ఆ ప్రాంతంలో భూమి యజమానులను ఒప్పించి తహసీల్దారు సమస్య పరిష్కరించాలరన్నారు. అనంతరం తహసీల్దారు, ఆర్‌ఐ, డిప్యూటీ తహసీల్దారులను సన్మానించారు.

వైఎస్సార్‌సీపీ నేతల సంతాపం



నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వీరబల్లి: మండలంలోని గుర్రప్పగారిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ ఉమామహేశ్వరరాజు తల్లి మృతి చెందారు. ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మణిరాజు, నాయకులు శ్రీరాములురెడ్డి, నారాయణరెడ్డి, సుబ్బరామరాజు, కార్యకర్తలు మృతురాలి భౌతిక కాయాన్ని సందర్శించి సంతాపం తెలిపారు.

కళింగర పండు.. ఆరోగ్యం మెండు



విక్రయానికి సిద్ధంగా కళింగర కాయలు



ముక్కలుగా కోసిన కళింగర కాయలు

సంబేపల్లె: ప్రస్తుతం ఎండలుమండిపోతున్నాయి. ఉదయం పది గంటలు దాటితే వేడి గాలులు ప్రారంభమవుతున్నాయి. అత్యవసర ప్రయాణం చేసే ప్రయాణీకులతోపాటు విద్యార్థులు, ఉద్యోగులకు పాట్లు తప్పడం లేదు. ఒకవైపు ఇంటర్, టెన్త్ పరీక్షలతో విద్యార్థులు సతమతమవుతున్నారు. ఈ సమయంలో దారి పొడవునా నేన్నానంటూ అటు దాహార్తి, ఇటు ఆకలిని తీరుస్తోంది కళింగర పండు. దీనిని పుచ్చకాయ అని కూడా పిలుస్తారు. సాధారణ వ్యక్తి కూడా కొనుగోలుచేసి తినగలిగే దివ్య ఫలంగా ఇది అందుబాటులో ఉంటోంది.

విరివిగా విక్రయాలు

అన్నమయ్య జిల్లాలోని ప్రధాన ప్రాంతాల్లో కళింగర పండ్ల విక్రయాలు అధికంగా జరుగుతున్నాయి. సంబేపల్లి, తదితర ప్రాంతాల్లోనూ చిరు వ్యాపారులు సైతం విక్రయిస్తున్నారు. ప్రస్తుతం వేసవి కావడంతో అధికంగా ఈ కాయల వ్యాపారమే ఎక్కువగా కనిపిస్తోంది. ఇతర పండ్లు, ఫలాలతో పోలిస్తే పుచ్చ కాయలు సరసమైన ధరలతో లభిస్తున్నాయి. రూ.100కు కాయ కొనుగోలుచేస్తే ఇంటిల్లిపాదీ స్వీకరించవచ్చు. ఇవి మన ప్రాంతంలో పండే పంట కంటే ఇతర ప్రాంతాల నుంచి వచ్చే కాయలు పెద్దవిగా ఉంటున్నాయి. ప్రతి ఒక్కరూ ఇష్టపడి తినే ఈ కళింగర కాయలను మార్కెట్‌లో విరివిగా లభిస్తున్నాయి. చిన్నపిల్లలు మొదలుకొని వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ ఈ కాయను తింటారు. వివాహాలు, శుభ కార్యాలు జరిగే సందర్భాల్లోనూ కోసి అందిస్తున్నారు.

పోషకాలు పుష్కలం

పుచ్చకాయలో బీవిటమిన్, పొటాషియం పుష్కలంగా ఉంటాయి. ఎలక్ట్రోలైట్లు సమృద్ధిగా లభిస్తాయి. కొలెస్ట్రాల్ ఉండదు ఈ కాయ తింటే తక్షణ శక్తితోపాటు శరీరానికి మేలు చేకూరుతుంది. 92 శాతం ఆల్కలైన్ నీళ్లతోపాటు పీచు పదార్థం ఉండడంతో శరీరానికి, మూత్రపిండాలకు, మూత్ర నాళాలకు ఉపయోగకరం. పుచ్చకాయ తినడంతో మలబద్ధకం తగ్గుతుంది. బీటాకెరోటిన్ రోగ నిరోధకశక్తిని పెంచుతుంది. వృద్ధాప్యంలో వచ్చే అంధత్వ సమస్యను నివారిస్తుంది. ఆస్మా, మధుమేహం, ఆర్థరైటిస్ సమస్యలకు బాగా పని చేస్తుంది. అంతేకాకుండా పుచ్చకాయ సౌందర్యానికి ఉపకరిస్తుంది.

ఆరోగ్య ప్రదాయిని



పుచ్చకాయలో 82 శాతం నీరు ఉండడంతో శరీరానికి కావాల్సిన చల్లదనాన్ని ఇస్తుంది. పుచ్చకాయలో పోషకాలు కూడా ఎక్కువగా ఉన్నాయి. పిల్లలు ఎక్కువగా తింటే జ్ఞాపకశక్తి పెరుగుతుంది. పుచ్చకాయ తింటే రక్తపోటు కూడా తగ్గుతుంది. పుచ్చకాయలో ఉండే మెగ్నీషియం, పొటాషియం గుండె ఆరోగ్యానికి తోడ్పడతాయి. వేసవిలో పుచ్చకాయ తినడం ఆరోగ్యానికి మంచిది.

– డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, సంబేపల్లె పీహెచ్‌సీ

30న షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్

నందలూరు: ఈ నెల 30, 31వ తేదీలలో ఉమ్మడి జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్ నాన్ మెడలిస్ట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్ సునీల్ తెలిపారు. విలేకరులతో శనివారం వారు మాట్లాడుతూ నందలూరు రైల్వే కేంద్రంలోని సౌత్ సెంట్రల్, రైల్వే ఎంప్లాయిస్ సంఘ కార్యాలయంలో ఈ టోర్నమెంట్ నిర్వహిస్తారన్నారు. పాల్గొనే వారు ఈ నెల 29వ తేదీలోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వరుస విజేతలకు రూ.7వేలు, రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు ఇస్తారన్నారు. క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న పోలీసులు

వీరబల్లి: మండలంలోని ఆమూరి వాల్లపల్లికి చెందిన కానిస్టేబుల్ ముకుందకు చాతీ నొప్పి రావడంతో శుక్రవారం మృతిచెందారు. శనివారం ఆయన స్వగ్రామంలో లక్కిరెడ్డిపల్లి సీఐ కొండారెడ్డి, ఎస్‌ఐ రవీంద్రబాబు, పోలీసు సిబ్బంది ప్రభుత్వ లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

రేషన్ కార్డుకు ఈకేవైసీ తప్పనిసరి



మాట్లాడుతున్న తహసీల్దార్ దైవాధీనం

సుండుపల్లె: రేషన్ కార్డు ఉన్న ప్రజలంతా ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని తహసీల్దారు దైవాదీనం తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శనివారం జరిగిన డీలర్ల సమావేశంలో దైవాదీనం మాట్లాడుతూ ఈకేవైసీ కాని సభ్యులకు రేషన్(యూనిట్స్) పంపిణీ ఆగిపోతుందని తెలిపారు. మండలంలో 5900 మంది రేషన్ కార్డు దారులు ఉన్నారని, మొత్తం 44 చౌకదుకాణాలు ఉన్నాయని తెలిపారు. కార్డులో యూనిట్స్ యొక్క ఆధార్ సీడింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ఐదేళ్లలోపు పిల్లలు ఎంతమంది ఉన్నారో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ తహసీల్దారు తిమ్మారెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు నాయక్, డీలర్లు పాల్గొన్నారు.

వాహనాల రికార్డులు చూపకుంటే చర్యలు



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సిద్దవటం: వాహనాల రికార్డులు చూపకుంటే చర్యలు తప్పవని డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని భాకరాపేట చెక్ పోస్టు వద్ద శనివారం సాయంత్రం డీఎస్పీ వెంకటేశ్వర్లు వాహన దారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ ధరించాలని, లైసెన్సులు తప్పనిసరిగా ఉండాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించి వాహనాలు నడపాలని, మద్యం తాగి నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ బాబు, పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహునికి విశేష పూజలు



స్వామికి విశేష పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. శనివారం టీటీడీ ఆధ్వర్యంలో ఆలయంలో స్వామివార్లకు విశేషమైన ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామునే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించి అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. తోమాల సేవ, ఏకాంతసేవ కావించారు. ఈ సందర్భంగా స్వామివారిని పలురకాల రంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

మౌలాకా పహాడ్‌లో పీఠాధిపతి ప్రార్థనలు



ఫాతేహా చేస్తున్న కడప అమీన్‌పీర్ దర్గా పీఠాధిపతి

పెద్దమండ్యం: రంజాన్ పవిత్ర 21వ ఉపవాస దినం సందర్భంగా కడప అమీన్‌పీర్ దర్గా పీఠాధిపతి మౌలాకా పహాడ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు కేఎస్ఎస్ ఆరీఫుల్లా హుసేనీ ప్రార్థనలు నిర్వహించి ఫాతేహా (చదివింపులు) చేశారు. మౌలాకా పహాడ్‌లో ఫాతేహా సందర్భంగా మదనపల్లె డీఎస్పీ దర్బార్ కొండయ్యనాయుడు ఆధ్వర్యంలో ఐదుగురు సీఐలు, 8 మంది ఎస్‌ఐలతో పాటు 70 మంది సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సాయంత్రం మౌలాకా పహాడ్‌కు చేరుకున్న కడప అమీన్‌పీర్ దర్గా పీఠాధిపతి కెఎస్ఎస్ అరీఫుల్లాహుసేనీ ఇఫ్తార్‌విందు చేసి, నమాజ్‌లో పాల్గొన్నారు. అనంతరం మౌలాఅలి ముష్కిల్ ఫాతేహా (చదివింపులు) కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తంబళ్లపల్లె టీడీపీ నేత దాసరిపల్లె జయచంద్రారెడ్డి, సీడ్ మల్లికార్జుననాయుడు, ముస్లింలు పాల్గొన్నారు.

వేసవిలో పశుపోషకులు జాగ్రత్తలు తీసుకోవాలి

తంబళ్లపల్లె: ఎండాకాలంలో రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్న కారణంగా పాడిరైతులు పశుపోషణలో ముందస్తు మెలకువలు పాటించడం ముఖ్యమని పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ సుమిత్ర తెలిపారు. పశువులను ఉదయం 10 గంటలలోపు, సాయంత్రం 4 గంటలు పైనే మాత్రమే మేతకు వదలాలన్నారు. పశువులను చెట్ల నీడనగాని, పాకల్లోగాని కట్టివేయాలన్నారు. పాకలు శుభ్రంగా ఉంచి చుట్టూ చెట్లు పెంచడం వల్ల మంచి గాలి, వెలుతురు ఉంటుందన్నారు. పశువులకు ఎక్కువ శక్తిని ఇచ్చే పచ్చిమేత ఆహారంగా ఇవ్వాలన్నారు. వడదెబ్బ బారిన పడితే వెంటనే పశువైద్యాధికారులను సంప్రదించి సెలైన్ ఇవ్వాలన్నారు. వేసవిలో పాదుగు వాపు వ్యాధి సోకే అవకాశం ఉంటుందన్నారు.

భాషాభివృద్ధిపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ



మాట్లాడుతున్న సుజామణి



శిక్షణా కార్యక్రమంలో అంగన్ వాడీ కార్యకర్తలు



అనంతంపల్లి హైస్కూల్‌లో శిక్షణా తరగతులు

పుల్లంపేట: పోషణా బీ.. పడాయి బీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అనంతంపల్లి హైస్కూల్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడో రోజు శిక్షణ ఇచ్చారు. సీడీపీఓ టీపీ.సౌభాగ్యమ్మ, ఏసీడీపీఓ సరళాదేవి ఆధ్వర్యంలో నవ చేతన, ఆదార్శిలా, ఆర్‌బీఎస్‌కె గురించి డాక్టర్ మనోజ్, సీహెచ్‌ఓ రాజ శిక్షణ ఇచ్చారు. అంగన్ వాడీ కేంద్రాలను లెర్నింగ్ సెంటర్‌గా మార్చడం, గృహ సంరక్షణ ఏ విధంగా చేయాలి? దివ్యాంగ పిల్లలను ఎలా గుర్తించాలి? అంశాలపై ఆన్‌లైన్‌లో టెస్ట్ నిర్వహించి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో మణెమ్మ, నిర్మలాదేవి, జయలక్ష్మమ్మ, రత్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట రూరల్: రాజంపేట ప్రాజెక్టు సీడీపీఓ వై.సుజామణి ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్‌జీఓ హోంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు గత మూడు రోజులుగా శిక్షణ ఇచ్చారు. ముగింపు కార్యక్రమంలో సుజామణి మాట్లాడుతూ 0–6 వయస్సు పిల్లలకు మంచి ఆరోగ్యం, భద్రత, తగిన పోషక ఆహారం అందించడమే తమ ఉద్దేశమని తెలిపారు. పిల్లల అభివృద్ధి అంచనాపై శిక్షణలో తెలుసుకున్న విషయాలను కచ్చితంగా అమలుచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.రాణి, పార్వతీదేవి, సుబ్బలక్షుమ్మ, శంకరమ్మ, సునీత పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లి: మండలంలోని ఉర్దూ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి మాట్లాడుతూ పిల్లల శారీరక అభివృద్ధి, మేథోభివృద్ధి, భాషాభివృద్ధి, సామాజిక భావోద్వేగాభివృద్ధి, సాంస్కృతిక, కళాత్మక అభివృద్ధిపై కార్యకర్తలకు శిక్షణ ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో దాద్‌బీ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

రామాపురం: రామాపురంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ శనివారం ముగిసింది. బాలింతలలో రక్తహీనత పిల్లలలో ఎత్తుకు తగట్టు బరువు తదితర అంశాలపై శిక్షణ తరగతులలో వివరించారు. పద్మజారాణి, హుసేనమ్మ, సుజాతరెడ్డి పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సిద్దవటం: వైఎస్సార్ జిల్లాలోని 17 మండలాల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సమగ్ర శిక్షా అకడమిక్ మానిటరింగ్ అధికారి వీరేంద్ర తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ప్రవేశాలుంటాయని అర్హులైన బాలికలు ఈ నెల 22వ తేదీ నుంచి ఏప్రిల్ 12వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు.

వీరబల్లి పీహెచ్‌సీ తనిఖీ



మందులను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి కొండయ్య

వీరబల్లి: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొండయ్య వీరబల్లి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, 104 ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సేవలు, ఎన్‌సీడీ ప్రోగ్రాం పనితీరుపై చర్చించి సూచనలు చేశారు. మందుల్లో నాణ్యత గురించి ఆరా తీశారు. డాక్టర్ మనీషా, డాక్టర్ జియాఉల్లా పాల్గొన్నారు.

24న సర్వసభ్య సమావేశం

చిట్వేలి: ఈ నెల 24వ తేదీన ఎంపీపీ సభా భవనంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మోహన్ తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొనాలని వారు కోరారు.

క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడితే కేసులు



ఎస్‌ఐ రవీంద్రబాబు

లక్కిరెడ్డిపల్లి: క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడితే కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని లక్కిరెడ్డిపల్లి ఎస్‌ఐ రవీంద్రబాబు హెచ్చరించారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఐపీఎల్ మ్యాచ్‌ల క్రికెట్ బెట్టింగ్‌పై ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుచేశామని తెలిపారు. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, డీఎస్పీ కృష్ణమోహన్ ఆదేశాలతో ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌ల బెట్టింగ్‌పై నిఘా పెట్టామని, ఎప్పటికప్పుడు పసిగట్టేందుకు ప్రత్యేక బృందం ఏర్పాటు చేశామని తెలిపారు. తమ సిబ్బంది నిరంతరం కేఫ్, టీ పాయింట్లు, హోటళ్లలో తప్పకుండా పరిశీలిస్తామని తెలిపారు.



ఎస్‌ఐ రామకృష్ణ

గాలివీడు: క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్‌ఐ రామకృష్ణ హెచ్చరించారు. ఐపీఎల్ క్రికెట్ లీగ్ ప్రారంభమైన దృష్ట్యా బెట్టింగ్‌లలలపై నిఘాకు టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ జిలాఎస్పీ, డీఎస్పీ, సీఐల ఆదేశాలతో మండల పరిధిలోని గ్రామాల్లో బెట్టింగ్ వ్యవహారాలు పసిగట్టేందుకు ప్రత్యేక బృందాన్ని నియమించినట్లు పేర్కొన్నారు. పిల్లల ప్రవర్తన, ఆర్థిక లావాదేవీలను తల్లిదండ్రులు గమనించాలన్నారు.



ఎస్‌ఐ వెంకట సుధాకర్‌రెడ్డి

రామాపురం: మండలంలో క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాలలో బెట్టింగ్ వ్యవహారాలను గమనిస్తూ ఉంటారని తెలిపారు. ప్రత్యేక బృందంతో పాటు తాను తమ సిబ్బంది కూడా నిరంతరం కేఫ్, టీ పాయింట్లు, హోటళ్లలను పరిశీలిస్తామని తెలిపారు. పిల్లల ప్రవర్తనపై తమ ఆర్థిక లావాదేవీలపై తల్లిదండ్రులు పెద్దలు గమనించాలని సూచించారు.

రాష్ట్ర స్థాయి యూత్ పార్లమెంటుకు ఎంపిక

కడప ఎడ్యుకేషన్: భారత ప్రభుత్వ క్రీడా, యువజన వ్యవహారాల శాఖ నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో కడప నగర శివారులోని కేఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన వికసిత్ భారత్ యూత్ పార్లమెంటు కార్యక్రమంలో రాష్ట్రస్థాయి పోటీలకు పది మంది యువతను ఎంపిక చేసినట్లు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి మణికంఠ తెలిపారు. అన్నమయ్య, కడప జిల్లా వ్యాప్తంగా యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో పాల్గొనడానికి తరలివచ్చిన యువత వన్ నేషన్ –వన్ ఎలక్షన్ అంశంపై తమ అమూల్యమైన ప్రసంగాలను తెలియజేసినట్లు వెల్లడించారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన విజేతలకు నగదు బహుమతులు ప్రదానం చేసినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన యువతకు శుభాకాంక్షలు తెలిపారు. కడప, అన్నమయ్య జిల్లా విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో కూడా తమ అమూల్యమైన ప్రసంగాలను తెలియ జేసి పోటీలలో విజయం సాధించాలని అకాంక్షించారు.

విజేతల వివరాలు...

విజేతలుగా ఎంపికైన వారిలో వెంకట సాహిత్య, షేక్ అమీషా నాజ్, ప్రొద్దుటూరు దస్తగిరి బాషా, జె.పి సంజన, షేక్ అర్షియా అహ్మద్, మహమ్మద్ కౌసర్, ఆకుల కంబగిరి స్వామి, కె వెంకట సాయినాథ్ రెడ్డి, హేమంత్ కుమార్, వివేకానంద రెడ్డి ఉన్నారు.

ఉపాధి హామీ నిధులతో నీటి కుంటల నిర్మాణం



కుంట నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న జవహర్ రెడ్డి



ప్రతిజ్ఞ చేస్తున్న కళాశాల ఏడీ సుధాకరరెడ్డి, తదితరులు



కుంటల నిర్మాణం ప్రారంభిసున్న ప్రభుత్వ విప్ శ్రీధర్

సంబేపల్లె: ఉపాధి హామీ నిధులతో నీటి కుంటల నిర్మాణం చేపడుతున్నట్లు ఏపీఎం రెడ్డి జవహర్ అన్నారు. అంతర్జాతీయ జలదినోత్సవం సందర్భంగా మండలంలోని శెట్టిపల్లె, పెద్దబిడికి గ్రామాల్లో శనివారం నీటికుంట నిర్మాణానికి ఆయన భూమిపూజ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వర్షపు నీటి నిల్వ కోసం కుంటలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నీటి ప్రాధాన్యం గుర్తించాలి

రాయచోటి అర్బన్: ప్రతి ఒక్కరూ నీటి ప్రాధాన్యం గుర్తించాలని శ్రీసాయి ఇంజినీరింగ్ కళాశాల ఏడీ సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ జల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ వర్షపు నీటిని భద్రపరిచేందుకు ఇంకుడుగుంతల నిర్మాణం, తక్కువ నీటితో పంటల సాగు పద్ధతులు, పునరుత్పాదక వినియోగం, గ్రీన్ టెక్నాలజీ వినియోగం చేపట్టాలన్నారు. ప్రతి నీటి తుంపరను సమర్థంగా వినియోగించుకోవడం అత్యంత ముఖ్యమన్నారు. ఎన్ఎస్ఎస్ అధికారి రెడ్డెయ్య మాట్లాడుతూ ప్రభుత్వం, పరిశ్రమల యాజమాన్యం, శాస్త్రవేత్తలు, సామాజిక సంస్థల సమన్వయంతో పనిచేస్తే భవిష్యత్తు తరాలకు నీటి కొరత లేకుండా చూడవచ్చునన్నారు. అనంతరం విద్యార్థులు నీటి పొదుపు, ఆవశ్యకతపై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ బాలాజీ, కెమిస్ట్రీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ జలాల పెంపే లక్ష్యం

ఓబులవారిపల్లె: పంట పొలాల్లో నీటి కుంటలు ఏర్పాటుచేసి భూగర్భ జలాలు పెంపొందించడమే లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ జల దినోత్సవం సందర్భంగా ముక్కావారిపల్లి గ్రామంలోని పొలాల్లో నీటి కుంటల నిర్మాణానికి శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అరవ శ్రీధర్ మాట్లాడుతూ నీటి వనరుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కుంటల ద్వారా నీరు నిల్వ ఉంచితే భూగర్భ జలాలు పెరిగేందుకు అవకాశం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మల్‌రెడ్డి, ఉపాధిహామి సిబ్బంది వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మండలంలో 88 నీటికుంటలు

చిట్వేలి: ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా మండలంలో 88 నీటి కుంటలు నిర్మిస్తున్నట్లు ఎంపీడీవో మోహన్, ఏపీఓ చంద్రకళ తెలిపారు. జలదినోత్సవం సందర్భంగా సి.కందులవారిపల్లి, నాగవరం గ్రామాల్లో నీటికుంటలను శనివారం వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జలవనరులను జాగ్రత్తగా చూసుకోవాలి



విత్తన ప్యాకెట్లతో గిరిజనులు

సుండుపల్లె: జలవనరులను జాగ్రత్తగా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మాతోట ప్రాజెక్టు సివిల్ ఇంజనీర్ నరసింహులు అన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా ఎగువ బిడికి గ్రామంలో ఆర్‌హెచ్‌జీబీఎంఎస్ఎస్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నీటిని వృథా చేయరాదన్నారు. అనంతరం గిరిజనులకు కూరగాయల విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చంద్రానాయక్, బాబు పాల్గొన్నారు.